బరువు....

పాలక్కూర శీతాలత

వాయునందనరావు గొంతులో స్థిరమైన నిర్ణయం ప్రతిధ్వనించింది

తమ్ముడి మాటలకు ఉలిక్కిపడ్డాడు యయాతి

తమ్ముడూ అన్నాడు కొంచెం గాభరాగా

అవును అన్నయ్యా . నాలో ఈ నిర్ణయం ఈ రోజు ఉదయం కల్గింది నా పరీక్షాఫలితాలు పేపర్లో చూసుకున్నప్పుడు ఫస్టు క్లాసులో వుంది నా నంబరు నాకంటే తక్కువ క్లాసులో ప్యాసయిన వాళ్ళు యం కాం చదువుతామనీ, సి ఏ చేస్తామనీ నిర్ణయాలు తీసుకుంటున్నారు అలాంటప్పుడు నేను కేవలం డిగ్రీతో చదువు మానెయ్యడం ఏం బాగుంటుంది?

జవాబు చెప్పలేక పోయాడు యయాతి

ఎంతలో ఎంతగా మారిపోయాడు తమ్ముడు!

నిన్నటి దాకా వాడు చెప్పిన కబుర్లకీ, ఈ మాటలకు ఎంత తేడా

నాకు తోడుగా వుంటాననీ ఉద్యోగం చేస్తూ సహాయపడతాననీ అన్నావుకదా

నిర్లక్ష్యంగా పెదవి విరిచేడు వాయునందనరావు

ఇక ముందు నేను చదవనని చెప్తే నా స్నేహితు లందరూ ఎలా నవ్వారో నీకు ఏం చెప్పను? నేను నా తెలివి తేటలు అన్నీ వృధా చేసుకుంటున్నాననీ, ఇంకాపై చదువులు చదివితే తప్పకుండా ఏ ఆఫీసరు ఉద్యోగమో దొరుకుతుందనీ నన్ను ప్రోత్సహిస్తున్నారు నాకూ అలాగే అన్పిస్తోంది అందుకు నువ్వు నన్ను ఆదుకోవాలి కాదనకు జీవితంలో లభించిన దానితో తృప్తి పడి ఊరుకోవడం కంటే చేతకాని తనం మరొకటి వుండదు అన్నాడు

ఆశ్చర్యంగా తమ్ముడి ముఖంలోకి చూసేడు యయాతి

ఎంత చిత్రంగా మాట్లాడు తున్నాడు!

కానీ అందుకు అవకాశం.. '

అవకాశం అన్నది దానంతట అది దొరకదు మనమే కల్పించుకోవాలి ఆఖరిక్షణంలో చెప్పి డబ్బు కావాలి అని నీ పీకల మీద కూర్చోదల్చుకో లేదు. అందుకే నాలో ఈ నిర్ణయం కలిగిన వెంటనే చెప్తున్నాను డబ్బు గురించి ప్రయత్నం చేసుకుందుకు నీకు చాలా సమ్యయం వుంది ఈలోగా యం కాం లో చేరేందుకు ఫారాలు తీసుకు వస్తాను ..

తను కట్టుకున్న ఆశా సౌదాలు కూలిపోవడమే కాక ఆకూలడం ఏదో తన నెత్తిమీదే జరిగినట్టు విలవిల లాడి పోయేడు యయాతి

ఒరేయ్ వాయూ. అంటూ అన్నగారు పిలుస్తున్నా కూడా తనకు వినపడనట్టుగా అక్కడ్నుంచి వేగంగా కదిలి వెళ్ళిపోయాడు వాయునందనరావు

యయాతి చిన్నగా నిట్టూర్చాడు

హుఁ తన నెత్తి మీద వున్న బరువు ఏదో తక్కువ అయినట్టుగా ఇప్పుడు మరికొంత బరువు

తను మొయ్యగలడా? లేక ఆ బరువు తననూ అణగదొక్కుతుందా? ,

కూర్చున్న కుర్చీలోనే వెనక్కు జార్లపడి కళ్ళు మూసుకున్నాడు

అతనికళ్ళ ముందు రీలగా గతం

* * * * * * *

వెూద్గల్యరావు గారు పని చెస్తున్నది గుమాస్తాగా అయినా అయన మీదవున్న బాధ్యతలు తక్కువేం కాదు

ముసలితల్లి, రోగిష్టి భార్య, ఇద్దరు కొడుకులు, ఆతర్వాత నలుగురు అమ్మాయిలు–ఈ బరువు చాలదన్నట్టు ఒక విధవ చెల్లెలు.

పెద్దకొడుకు యయాతి బి. కాం చదువు తున్నాడు రెండో వాడు వాయునందనరావు ఇంటర్లో , వున్నాడు. మిగతా ఆడపిల్లలు హైస్కూలు ఎలిమెంటరీ స్కూలు లోనూ చదువుతున్నారు భార్యకు ఈ మధ్య జబ్బు చేస్తే వడ్డీ మీద అప్పు తెచ్చారు తల్లికి కళ్ళు కన్పించక పోవడంతో ఆమెకు ఆపరేషన్ చేయించారు విధవ చెల్లెలు తాలూకు బాధ్యత జీవితాంతం భరించ వల్సిందే

ఇలాంటి పరిస్థితుల్లో ఆయన హఠాత్తుగా ఒక రోడ్డు ప్రమాదంలో కన్ను మూశారు

ఆడుతూ పాడుతూ కాలేజీ జీవితం గడుపు తున్న యయాతిని బాధ్యతల తాలూకు బంధాలు గట్టిగా బిగించాయి చదువుతున్న చదువు మధ్యలో ఆపవల్సి వచ్చింది

ఆ ఆఫీసు వాళ్ళే దయదల్చి ఉద్యోగం ఇచ్చేరు యయాతికి

అన్ని బాధ్యతల్నీ చిరునవ్వుతో స్వీకరించేడు ఒక్కసారి కూడా బాధపడలేదు పెదవుల మీద మాయని చిరునవ్వుతో, ఇంట్లో ప్రతి ఒక్కరి అవసరాలు తీరుస్తూ కాలం గడపసాగేడు

సంవత్సరాలు గడిచి పోయాయి

తమ్ముడిని కాలేజీలో బి. కాం. లో చేర్పించాడు.

వయసు వచ్చిందని పెళ్ళి చేసుకోమని కోరింది తల్లి అడ్డంగా తల ఊపేడు

వద్దమ్మా . నా జీవిత లక్ష్యం వేరు పెళ్ళి చేసుకుంటే ఆలక్ష్యం సాధించలేను

అందుకే ఆ విషయంలో నన్ను బలవంతం చెయ్యకు అన్నాడు

ఆదేమిట్రా మా అందరికోసం నువ్వు నీ జీవితం త్యాగం చేసుకుంటావా?' అంది తల్లి బాధగా

ఆ బాధని గమనించనట్టుగా జవాబు చెప్పాడు యయాతి,

అంత పెద్ద మాట వాడకమ్మా, ఇందులో ఏదో త్యాగం వుందని నేను అనుకోను నాన్నగారు నాకు అప్పు చెప్పిన బాధ్యతలు నిర్వహించ గలిగితే అంతక్కంటే నాకు సంతోషం వుండదు. నీకు కోడల్ని తెచ్చుకోవాలని వుండవచ్చు కానీ నాకు మాత్రం భార్యను పొందాలని లేదు భార్య అంటూ వస్తే మనిషి స్వార్థంగా ప్రవర్తించే అవకాశం వుంటుంది ఆ పరిస్థితి రాకూడదు.

డిగ్రీ చదువుతున్న వాయునందనరావు అన్నగారి గొప్పతనాన్ని అర్థం చేసుకున్నాడు

అన్నయ్యో నేను చదువు మానేస్తాను నీకు తోడుగా ఏదైనా ఉద్యోగం చేస్తూ బాధ్యతలు పంచుకుంటాను అన్నాడు

కంగారుగా తమ్ముడి వంక చూసేడు యయాతి

వద్దు తమ్ముడూ అంతపని చెయ్యకు . కనీసం డిగ్రీ కూడా చదవకపోతే ఏం మంచి ఉద్యోగం వస్తుంది చెప్పు? నేను ఏదో శ్రమపడి పోతున్నానన్న ఆలోచనలు మానుకుని శ్రద్ధగా చదువు డిగ్రీ పూర్తి చెయ్యి తర్వాత సంగతి ఆలోచిద్దాం నేను పూర్తి చెయ్యలేక పోయిన డిగ్రీ చదువు కనీసం నువ్వయినా చదవాలి అన్నాడు అందుకు అంగీక రించాడు వాయునందనరావు

వీలు దొరికినప్పుడల్లా అన్నగారికి మానసిక స్థైర్యం కలిగేలా"

'ఇంకెంత అన్నయ్యా ఇంకొక్క ఏడాది నా చదువు పూర్తి కాగానే ఇకనువ్వు అభ్యంతరం పెట్టినా కూడా వినకుండా ఏదో ఒక ఉద్యోగం చూసుకుని నీకు తోడుగా వుంటాను అనేవాడు

ఆ మాటలకే యయాతి పొంగి పోయేవాడు ఎంత మంచి మనసు తన తమ్ముడిది!

'నీలాంటి తమ్ముడు దొరికిన ఏ అన్న అయినా చాలా చాలా అదృష్టవంతుడు

ఇంటి పరిస్థితులు అర్థం చేసుకుని అన్నకు చేదోడు వాదోడుగా వుంటానని అనే తమ్ముళ్ళు ఎందరు వుంటారు గనుక?' అని ఆనందించేవాడు

ఒకసారి వెూద్గల్యరావు గారి విధవ చెల్లెలుకి బాగా జబ్బు చేసింది అందుకోసం ఎక్కడెక్కడి నుంచో డబ్బు తెచ్చి సుమారు రెండు వేలు ఖర్చు చేశాడు యయాతి

అది చూసి చిరాకు పడ్డాడు వాయునందనరావు.

మన కుటుంబం తాలూకు బాధ్యతలతో సతమత మవుతుంటే ఈ అత్తయ్య బరువు కూడా మన మీదే పడాలా? ఆవిడను భరించ వల్సిన అవసరం మనకు ఏమిటి? ఆవిడను ఎక్కడికయినా పంపేసెయ్యి అన్నాడు

తల అడ్డంగా తిప్పాడు యయాతి.

'తప్పురా . ఆమె పరాయిది కాదు నాన్న గారికి చెల్లెలు. నీకు నీ చెల్లెలుతో ఎలాటి రక్తసంబంధం వుందో నాన్న గారికి ఆమెతో కూడా అంతే ఆమెను చూసేవారు ఎవ్వరూ లేరు ఆమెను మనమే భరించాలి. అప్పుడే నాన్న గారి ఆత్మకు శాంతి ఇలా ఎన్నడూ మాట్లాడకు బాధ్యతల నుంచి తప్పుకోవాలని అనుకోవడం పిరికి వాళ్ళ లక్షణం సుమా!" అంటూ నచ్చ చెప్పాడు యయాతి,

ఆ మాటలతో వాయునందనరావు కళ్ళ పొరలు

ఏడి పోయాయి. అన్నగారు అతని కళ్ళకు సాక్షాత్తు భగవంతుడిలా గోచరించాడు.

"అన్నయ్యా.... నువ్వు చాలా ఉత్తముడివి. నీకు చేతులెత్తి నమస్కారం చేస్తున్నాను. నీలాంటి సంస్కార వంతులు కోటికి ఒకరు వుంటారు... అన్నాడు.

చిన్నగా నవ్వి ఊరుకున్నాడు యయాతి.

వాయునందనరావు పరీక్షలు దగ్గరకు వస్తున్న కొద్దీ అతను ఎంతో శ్రద్ధగా చదువుతున్నాడు.

అలా చదువుతూనే మధ్య మధ్యలో –

"ఉద్యోగం గురించి ఇప్పటి నుంచీ ప్రయత్నిస్తే మంచిదేమో!" అనేవాడు.

యయాతి తను పనిచేస్తున్న ఆఫీసులోనే పెద్ద ఆఫీసరుని కలిశాడు. శ్రద్ధగా పని చేసే అతనంటే ఆఫీసులో అందరికీ మంచి గౌరవం వుంది ఆ గౌరవం కొద్దీ ఆ ఆఫీసరు వాయునందన రావుకి తమ ఆఫీసులోనే ఉద్యోగం ఇయ్యడానికి అంగీకరించాడు.

"మీ తమ్ముడిని నేను చూశాను. తెలివైన వాడు. చురుకైనవాడు. అతనికి ఉద్యోగం ఇయ్యడానికి నేను అంగీకరించింది నిన్ను చూసి కూడా. నీ వినయ విధేయతలు, కష్టపడి పని చేసే తత్వం నన్ను బాగా ఆకర్షించాయి. నీకష్టం తీర్చడం నా బాధ్యతగా భావించి ఈ సహాయం చేస్తున్నాను...." అన్నాడు ఆ ఆఫీసరు.

ఆనందరితో పొంగి పోయాడు యయాతి.

"చాలా థాంక్స్ సార్" మీ మేలు నేను ఎన్నడూ మరువలేను... " అన్నాడు కృతజ్ఞత ఉట్టి పడుతున్న గొంతుకతో యయాతి.

ఆ కబురు విన్న వాయునందనరావు కూడా పొంగిపోయేడు. "నిజంగా ఆయన మనపాలిట భగవంతుడే..." అన్నాడు.

ఆ మాట అక్షరాల నిజం. ఆతర్వాత వాయునందనరావు ఆ ఆఫీసరుని కలిసేడు.

"పరీక్షలు రాసి ప్యాసుకా.... డిగ్రీ సర్టిఫికెట్ తెచ్చుకో... ఆ తర్వాత ఉద్యోగం ఇస్తాను.." అన్నాడు ఆయన.

ఒక నమస్కారం చేసి వచ్చేశాడు వాయునందన రావు.

పరీక్షలు పూర్తికాగానే ఉద్యోగంలో చేరిపోవాలని ఉబలాట పడ్డాడు కానీ యయాతి వారించాడు.

"నీ పరీక్షా ఫలితాలు రానియ్యి... నువ్వు ప్యాసు కావడంలో ఏదో సందేహం వుండి ఇలా అనటం లేదు. ఒకసారి ఉద్యోగంలో అంటూ చేరితే ఇక జీవితం అంతా తీరిక లేకుండా పోతుంది. కనుక ఈ శలవల్లో అయినా కాస్త ఎంజాయ్ చెయ్యి.... పైగా డిగ్రీసర్టిఫికెట్ చేతికి వచ్చాకనే నీకు ఉద్యోగం ఇస్తానని అన్నారు కనుక అంత తొందర లేదు...."

సరే అనక తప్పలేదు వాయునందన రావుకి.

అలాంటి వాడు ... ఈ రోజున... పరీక్షా ఫలితాలు పేపర్లో వచ్చిన ఈరోజున.... తన నిర్ణయం మార్చుకున్నాడు. ఎందుకని?

వాడిలో ఆ మార్పు ఎలా వచ్చింది? కుటుంబ పరిస్థితుల్ని ఎలా మార్చి పోగలిగాడు?

తను ఖచ్చితంగా పై చదువులు చదువుతాననీ అందుకు అవసరం అయిన సొమ్ము సిద్ధం చేసుకోమనీ ఎంతనిక్కచ్చిగా చెప్పాడు!

తన బరువులో భాగం పంచుకుంటానని ఇన్ని కబుర్లు చెప్పిన వాడు ఇలా తన బరువు మరింత పెంచడానికి ఎందుకు సిద్ధపడ్డాడు!

తన తమ్ముడి మంచి తనాన్ని చూసి తను ఎంతో సంబరపడి పోయాడు. తన భుజాల మీంచి కొంత భారం తగ్గుతోందని భావించి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

కానీ..... కానీ ...

తన ఆశలు అన్నీ కూలిపోయాయి. తన కలలు అన్నీ కరిగి పోయాయి.

హే భగవాన్.. ఏమిటీ పరీక్ష?

"బాబూ... నీకు టైము అవుతున్నట్టు వుంది.... భోజనం వడ్డించనా?" అంటూ తల్లి వచ్చి పలుకరించడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు యయాతి

"ఆఁ... . వడ్డించు అమ్మా...." అంటూ లేచాడు.

ఎందుకో సరిగ్గా అన్నం తినలేక పోయాడు. పెరగబోతున్న భారం అతని ఆకల్ని దూరం చేసిందా?

"ఏం బాబూ.. అన్నం సరిగ్గా తినటం లేదు . " అంది తల్లి

వాయునందనరావు నిర్ణయం ఆమెకు ఇంకా తెలియదు. ఆమెకు చెప్పి ఆమె మనశ్శాంతి దూరం చెయ్యదల్చుకోలేదు యయాతి.

అందుకే ఏదో అని మాట తప్పించేశాడు

ఆఫీసుకి వెళ్ళి పోయాడు.

★ ★ ★ ★ ★

అన్నగారితో నిక్కచ్చిగా మాట్లాడిన తర్వాత అక్కడ వుండలేక రోడ్డు మీదకు వచ్చేశాడు వాయునందనరావు ఆ తర్వాత ఎక్కడకు వెళ్ళాలో, ఏం జెయ్యాలో తోచలేదు అందుకే గమ్యం ఎరుగని బాటసారిలా కాళ్ళు తీసుకు వెళ్తున్న చోటికి అలా నడుచుకుంటూ వెళ్ళసాగాడు. అతని మెదడు నిండా గజిబిజిగా ఆలోచనలు

ఆ రోజు ఉదయం పరీక్షా ఫలితాలు వస్తాయని తెలిసి పెందరాళే లేచి పోయాడు తను తప్ప కుండా ప్యాసు అవుతానని నమ్మకం వున్నా పేపర్లో నంబరు చూసుకుంటే అదో తృప్తి ఇంట్లో పేపరు తెప్పించరు కనుక రోడ్డు మీదకు వచ్చాడు తియ్యని కలలతో –

తను పరీక్ష ప్యాసుఅవుతాడు మరొక పది రోజుల్లో డిగ్రీ కాగితం చేతికి వస్తుంది. ఆ తర్వాత తను ఉద్యోగం చేస్తాడు

రోడ్డు మీదే అతని క్లాస్ మేట్స్ మరో నలుగురు తగిలారు అందరూ కల్సి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ బస్‌స్టాండ్‌కి వెళ్ళేరు అప్పుడే వచ్చాయి ఆనాటి దినపత్రికలు

పేపర్లో నంబరు చూసుకున్నాడు. తను ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు మిగతా అందరిదీ సెకండు క్లాస్

ఆనందంతో కేరింతలు కొట్టారు అందరూ

ఏరా నీ తర్వాతి కార్యక్రమం ఏమిటి?" ఒకడు అడిగేడు

జవాబు చెప్పాడు

'ఛ" అదేమిటిరా .. చదువు కోవల్సిన వయసులో చదువుకోవాలి. అప్పుడే ఉద్యోగం ఏమిటి? పైగా ఫస్టుక్లాసు వచ్చింది కూడా

'అవున్రా సెకండు క్లాసు వచ్చిన నేను యం. కాం. చెయ్యాలనుకుంటుంటే నువ్వు ఉద్యోగంలో చేరి చదువు మానేస్తావా? నీకు మంచి భవిష్యత్తు వుందిరా అనవసరంగా పాడు చేసుకోకు."

"డిగ్రీ చదువుకి ఈ రోజుల్లో విలువ ఏముందిరా?"

ఈ మాటలన్నీ బాగా పని చేశాయి తన మీద.

"అదికాదురా మా ఇంటి పరిస్థితులు... " చిన్నగా గొణిగేడు

"అలా అనకు మనసుంటే మార్గం వుండక పోదు మీ అన్నయ్యను అడుగు... పై చదువులు చదివితే తప్పకుండా ఆఫీసరు కాగలవు"

తన కళ్ళముందు ఎన్నెన్నో కలలు .... అందమైన రంగురంగుల కలలు.

అందుకే అన్నగారి దగ్గరకెళ్ళి తన నిర్ణయంలోని మార్పు చెప్పాడు

తను పై చదువులు చదివి తీరాలి . ఇది తన తిరుగు లేని నిర్ణయం..

బరువు

"హలో . ఎటు బయలు దేరావు?" ఎవరో అడిగారు.

ఆ మాటలకు ఈ లోకంలోకి వచ్చాడు.

చుట్టూ చూశాడు.. ఇల్లు విడిచి చాలా దూరం వచ్చేశాడు... అన్నగారి ఆఫీసు వున్న ప్రాంతం అది.

పలకరించిన మిత్రుడికి ఏదో జవాబు చెప్పాడు. అతను వెళ్ళి పోయాడు

అప్పుడే ఒక ఒంటి ఎద్దు బండి అతని వైపు వస్తూ కన్పించింది. కాలిబాట మీద ఎక్కి ఆ బండివైపు చూస్తూ వుండి పోయాడు. సిటీలో ఇలా ఎద్దు బళ్ళు తక్కువగా వెళ్తూ వుంటాయి రోడ్డు మీద. పల్లెటూరి నుంచి ఏదో పనిమీద వస్తాయి కాబోలు.

బండిని పరీక్షగా చూశాడు. ఎద్దు వంక చూశాడు.

ఎద్దు ఎందుకో కన్నీరు కారుస్తోంది. బరువు మొయ్యలేకనా?

బరువు కూడా చాలా ఎక్కువగా వుంది. పాపం .. భారంగా.... మొయ్యలేక... మొయ్యలేక.. నెమ్మదిగా ఈడుస్తోంది.

సరిగ్గా అప్పుడే ఒక ఘోరం జరిగి పోయింది.

ఆ ఎద్దు రోడ్డు మీద కూలబడి పోయింది!

బండివాడు లబో, దిబో అంటూ దిగేడు. నేల కూలిన ఎద్దుని పైకి లేపడానికి ప్రయత్నిస్తున్నాడు కానీ వీలు కావటం లేదు.

"పాపం.. దాని కాలు జారి వుంటుంది.. బండి మీద చాలా బరువు వేశావు".. అన్నాడు వాయునందనరావు కల్పించుకుని

"ఏం సెయ్యను దొరా.. తప్పు అయిపోనాది... కక్కుర్తి పడి పోయినాను".. అన్నాడు వాడు.

"నేను నీకు సహాయపడ గలనా?" అడిగేడు.

"ఈ బస్తీలో ఎవుడూ ఎవడ్నీ పట్టించుకోడు. చాలా మంచోడివి లాగున్నావు బాబూ...." అన్నాడు.

తేలిగ్గా నవ్వేశాడు.

ఎద్దును పైకి లేపడంలో ఆబండివాడికి సహాయ పడ్డాడు కానీ లాభం లేక పోయింది.

"బండిలో బరువు తగ్గించాలేమో!" అన్నాడు వాయునందనరావు ఆలోచించి.

"మరో దారి అగుపించదు .." బండివాడు అన్నాడు.

అప్పుడే మరొక రెండు ఎద్దుల బండి వచ్చింది. అది ఖాళీగా వుంది. ఆ బండివాడు మొదటి వాడిని చూసి–

"ఏంది రంగన్నా... ఏటైనాది?" అడిగేడు

"ఏం సెప్పను సుబ్బయ్య మావా... ఎద్దు కూలబడి పోనాది."

సుబ్బయ్య బండివంక పరీక్షగా చూశాడు

"ఏంది రంగన్నా... అంత బరువు ఎట్టినావు ఆ ఎద్దు బతకాలనా సావాలనా అంతగా ఆశ పనికి రాదు.. రెండు ఎద్దులు మొయ్యాల్సిన బరువది ఒక్కటి ఎలా మోస్తది?.. దాని కాలు ఇరగి సచ్చి పోతే నీకు ఈ ఆదారం కూడా వుండదు ... ఇలాగ ఎప్పుడూ సెయ్యబోకు.. " అంటూ మెత్తగా చివాట్లు పెట్టాడు సుబ్బయ్య.

తల వంచుకున్నాడు రంగన్న.

"ఇక ఎన్నడూ అలా సెయ్యను.. ఇప్పుడు నన్ను కాపాడు మావా...." దీనంగా అన్నాడు.

"ముందు ఆ బండి ఖాళీ సెయ్యాల. ఆ సామానంతా నా బండిలో ఎట్టు... అప్పుడు బండి తేలిక అయ్యి ఎద్దు లేవగలుగు తుంది. దాన్ని పైకి లేపి కాలు గానీ ఇరిగిందేమో సూడాలి."

తల ఊపాడు.

రంగన్న, సుబ్బయ్య – ఇద్దరూ కల్సి చకచకా ఒంటి ఎద్దు బండిని ఖాళీ చేసి ఆ సామాను రెండు ఎద్ల బండిలో వెయ్యసాగారు.

వాయునందనరావు అక్కడే వుండి ఇదంతా గమనిస్తున్నాడు. ఈ వ్యవహారం ఏదో తేలిపోయే వరకూ అక్కడ నుంచి కదలాలని లేదు అతనికి.

ఒక అరగంటలో సామాను మార్పిడి పూర్తి అయ్యింది.

ఆ ఇద్దరూ కలిసి పడి పోయిన ఎద్దును పైకిలేపారు. సుబ్బయ్య ఆ ఎద్దు కాలు దగ్గర కూర్చుని చిన్నగా మాలిష్ చేశాడు.

"అదురుష్టం .. కాలికి ఏం కాలేదు.. " అన్నాడు.

సామాను నిండివున్న బండి తాలూకు ఎడ్ల వైపు చూశాడు వాయునందనరావు.

ఆ ఎద్దుల ముఖాలు నిర్మలంగా వున్నాయి. ఎలాంటి అలసటా లేదు

అవును .. బరువును సమానంగా పంచుకుంటు న్నాయి కదా!

"చూసేవా.. రంగన్నా. . నీ బండిలో సామానంతా నా బండిలో ఏసినా ఆ ఎద్లు ఎంత తేలిగ్గా ఉన్నాయో సూడు . మరింత బరువు కూడా మొయ్యడానికి సిద్దంగా ఉన్నాయి దీని వల్ల ఒక సత్తెం తెలుస్తది... బోలెడు బరువు ఉన్నాదంటే అది ఒక్కడూ మొయ్యనేడు. ఆబరువుకి కింద పడిపోయి సచ్చిపోతాడు. అదే బరువు ఇద్దరు మోస్తా వుంటే ఏ ఒక్కడికీ అంత కష్టం అనిపించదు. సర్లే ... పద " అంటూ బండి ఎక్కి ఎద్లను అదిలించాడు.

బళ్ళు రెండూ ఒకదాని వెనుక నడవసాగాయి

వాటి వంక రెప్పలు వాల్చడం మరిచి పోయిన వాడిలా చూస్తూ వుండి పోయాడు వాయునందన రావు

ఈ సుబ్బయ్య ఏమీ చదువుకోలేదు అయినా ఎంత చక్కని సత్యం చెప్పాడు.

అనుభవాన్ని మించిన చదువు ఈ ప్రపంచంలో లేదుకాబోలు!

సుబ్బయ్య మాటలు మాటిమాటికీ అతని చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

బరువు . పంపకం... తేలిక..

తన అన్నగారి నెత్తి మీద ఎన్ని బాధ్యతలు

ఆ బాధ్యతలన్నీ మోస్తూ ఇక మొయ్య లేక ఏ ఆరోగ్యమో చెడగొట్టుకుని అన్నగారు ఆ ఒంటి ఎద్దులా కూలిపోతే. ..

ఆ బరువు అంతా తను మొయ్యాలి.

అంతకంటే ఆ బరువు ఏదో ఈక్షణం నుంచే తను

పంచుకుంట అటు అన్నగారికీ సుఖం తనకూ గౌరవం!

అన్నగారి మంచితనం అంతా అతనికి గుర్తు వచ్చింది

మొయ్యవల్సిన బాధ్యతలు ఎన్ని వునా కూడా చిరాకుపడకుండా ఎంతో సమర్థతతో, ఎవ్వర్నీ నొప్పించకుండా ఏ ఒక్కరూ తమ అవసరాలు తీరలేదని బాధపడే అవకాశం కల్పించకుండా ప్రవర్తించే ఆతీరు–

నిజంగా అతను భగవత్స్వరూపుడే. అలాంటి వాడికి అంతకష్టం కలిగించాడుతను!

ఎంత పరుషంగా మాట్లాడేడు!

ఎంత మూర్ఖంగా ప్రవర్తించేడు!!

తన చదువు తనకు వివేకం నేర్పవల్సింది పోయి తనని మూర్ఖుడిని చేసింది

అన్నగారు తన మనసు ఎంతలా కష్ట పెట్టుకున్నాడో కదా ఏమనిషి అయినా తన తాహతు బట్టి ఆశలు పెంచుకోవాలి కానీ అందరాని ఎత్తులకు ఎగరాలని కలలు కనడం ఏం సబబు? ఆకాశం దించేస్తాను నెలవంకను తుంచేస్తాను అని అన్నంత సులభం కాదు ఆపన్లు చెయ్యడం వివేకంతో పరిస్థితుల్ని గుర్తు పెట్టుకుని ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి కానీ ఆధారం లేకుండా గాలిలో ఎగిరితే క్రింద పడక తప్పదు తన యం కాం చదువు అంటే మాటలా? రెండేళ్లు చదవాలి వేలు ఖర్చు చెయాలి

నో అలా కాకూడదు

కలలోంచి తను వాస్తవంలోకి రావాలి.

ఊహలు మరిచి నిజం తెలుసుకోవాలి

ఇక్కడ్నుంచి తిన్నగా అన్నయ్య ఆఫీసుకి వెళ్లి అతన్ని కలియాలి.

తన నిర్ణయం అతని మనసులో కల్గించిన బాధని వెంటనే దూరం చెయ్యాలి.

'అన్నయ్యా.... నన్ను క్షమించు... ఉదయం ఏదేదో నోటికి వచ్చినట్లు వాగాను. నీ మనసుకి కష్టం కల్గించాను. నేను వెంటనే ఉద్యోగంలో చేరి నీ బాధ్యతలో పాలు పంచుకుంటాను. నేను నీకు మరింత భారం కల్గించదల్చుకోలేదు అని చెప్పాలి.

వెంటనే గబగబా అడుగులు వేస్తూ అన్నగారి, ఆఫీసుకి చేరాడు

అక్కడ యయాతి సీట్లో కన్పించలేదు. ఆశ్చర్య పోయాడు

'ఏమండీ . మాఅన్నయ్య ఎక్కడకు వెళ్లాడు?" అడిగేడు పక్కసీటు ఆయన్ని.

"అతను ఈరోజు ఆఫీసుకి రాలేదు కారణం తెలియక ఆలోచించు కుంటున్నాం

కుంభవృష్టి కురిసిన రోజున కూడా రాకుండా మానలేదు మీ అన్నయ్య అవునూ. అతను ఇంట్లోలేడా?'

"నేను ఉదయమే ఇంట్లోంచి వచ్చేశాను ఈ పాటికి అన్నయ్య ఇక్కడకు రావాలికదా అని అనుకుని ఇలా వచ్చాను. అన్నయ్య వంట్లో బాగానే వుంది మరి ఎందుకు రాలేదో!"

ఇ·వేమన·పద్యాలు

వంపుకఱ్ఱ కాల్చి వంపుదీర్పగవచ్చు
కొండలన్ని పిండి గొట్టవచ్చు
కఠిన చిత్తు మనసు కరగింపగారాదు
విశ్వదాభి రామ వినుర వేమ

ఆలోచిస్తున్నట్లు అన్నాడు వాయు నందనరావు అక్కడ నుంచి వచ్చేశాడు

తను వెంటనే ఇంటికి వెళ్లాలి అన్నయ్యను కలుసుకోవాలి.

అతను నడిచి వెళ్తూ వుంటే రోడ్డు పక్కన ఒక గుంపు కనపడింది

"ఎవరో పాపం లారీక్రింద పడి అక్కడి కక్కడే పోయాట్ట .. పోలీసులు వచ్చారు." అన్నారు ఎవరో

వాయునందనరావు ఇల్లు చేరే ఆత్రంలో ఆ విషయం పట్టించుకోలేదు.

"ఆఁ ఇలాంటి ప్రమాదాలు దేశంలో రోజుకు వంద అవుతున్నాయి...' అనుకుని అక్కడ నుంచి కదిలిపోయాడు

అతను కూడా ఆ గుంపులో దూరి ఆ చనిపోయిన వ్యక్తి వంక ఒక్కసారి చూసి వుంటే అలా శవంగా మారింది యయాతే అని గుర్తించి వుండేవాడు వాయునందనరావు

అంతవరకూ తన బరువు తగ్గిస్తాడని భావించిన తమ్ముడు తనకు మరొక అదనపు బరువుగా తయారవుతున్నా డన్న బాధతో, చికాకు నిండిన మనసుతో, ఏవేవో గజిబిజి ఆలోచనలతో పరాకుగా నడుస్తూ ఆఫీసుకు వెళ్తున్న యయాతి ఎదురుగా వస్తున్న లారీని గానీ, అది చేసిన శబ్దాన్ని గానీ గమనించనందువల్ల దాని క్రింద పడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు

ఆ ఇంటి బరువు బాధ్యతలు పూర్తిగా రేపట్నుంచి వాయునందనరావువే! □